12-02-2022 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

“మధురమైన పిల్లలూ - తండ్రి వచ్చారు, అనాథలను సనాథలుగా చేయడానికి, అందరినీ దుఃఖాల నుండి విడిపించి సుఖధామంలోకి తీసుకువెళ్ళడానికి”

ప్రశ్న:- కల్ప-కల్పము తండ్రి తమ పిల్లలకు ఎటువంటి ఓర్పునిస్తారు?

జవాబు:- మధురమైన పిల్లలూ - మీరు నిశ్చింతగా ఉండండి, విశ్వంలో శాంతిని స్థాపన చేయడం, సర్వులను దుఃఖాల నుండి విడిపించడము నా పని. నేనే వచ్చాను, పిల్లలైన మిమ్మల్ని ఈ రావణ రాజ్యం నుండి విడిపించి రామరాజ్యంలోకి తీసుకువెళ్ళడానికి. పిల్లలైన మిమ్మల్ని తిరిగి తీసుకువెళ్ళడం నా కర్తవ్యమే.

గీతము:- ఆకాశ సింహాసనాన్ని వదిలి రండి... (ఛోడ్ భీ దే ఆకాశ సింహాసన్...)

ఓం శాంతి. పిల్లలు పాటను విన్నారు. తమ పరమప్రియ పరమపితను, మళ్ళీ రండి అని పిల్లలు స్మృతి చేస్తారు, ఎందుకంటే మాయ నీడ పడింది అనగా రావణరాజ్యం అయిపోయింది. అందరూ దుఃఖితులుగానే ఉన్నారు. మేమందరము పతితులుగా ఉన్నామని అంటారు. కావున బాబా అంటారు, నేను కల్ప-కల్పము, కల్పము యొక్క సంగమయుగంలోనే వస్తాను. 5000 సంవత్సరాల క్రితం కూడా వచ్చాను, మళ్ళీ కల్పము యొక్క సంగమయుగంలో వచ్చి ఉన్నాను. తండ్రి వచ్చి ఓర్పునిస్తారు. పిల్లలూ, నిశ్చింతగా ఉండండి, ఇది నా పాత్రనే. పిల్లలంటారు, బాబా, రండి, వచ్చి మళ్ళీ రాజయోగాన్ని నేర్పించండి. పతిత ప్రపంచాన్ని వచ్చి పావనంగా చేయండి. ఈ సమయంలో అందరూ అనాథలుగా ఉన్నారు. ఎవరికైతే తల్లి-తండ్రి ఉండరో, వారిని అనాథులని అనడం జరుగుతుంది. పరస్పరంలో గొడవపడుతూ-కొట్లాడుకుంటూ ఉంటారు. అందరూ చాలా దుఃఖితులుగా ఉన్నారు. మొత్తం ప్రపంచంలో అశాంతి ఉంది, అందుకే, పిల్లలను దుఃఖం నుండి దాటించి లేదా రావణ రాజ్యం నుండి విడిపించి రామరాజ్యంలోకి, సుఖధామంలోకి తీసుకువెళ్ళడానికి వచ్చారు. తండ్రి అంటారు, ఇది నా కర్తవ్యము. మొత్తం ప్రపంచానికి అనగా ఆత్మలందరికీ తండ్రి ఒక్కరే. అందరూ అంటారు, ఓ అనంతమైన బాబా, మీరిప్పుడు పై నుండి సింహాసనాన్ని వదిలి వచ్చారు. బ్రహ్మ మహాతత్వంలో ఉంటారు కదా. ఇక్కడ జీవాత్మలు ఉన్నారు. అక్కడ ఉన్నది ఆత్మల యొక్క స్థానము, దానిని బ్రహ్మాండము అని అనడం జరుగుతుంది. కావున తండ్రి పిల్లలకు అర్థం చేయిస్తారు, ఇది సుఖ-దుఃఖాల నాటకము. ఓ పరమపిత పరమాత్మా, అని పిలుస్తారు కూడా, ఎందుకంటే దుఃఖితులుగా ఉన్నారు. ఈ పాట కూడా దీనిపైనే పాడడం జరిగింది. పిల్లల ద్వారా ఏ పొరపాటు జరిగింది. తండ్రిని మర్చిపోయారు. గీతా భగవంతుడు, ఎవరైతే సహజ రాజయోగాన్ని నేర్పించారో, అనాథలను సనాథలుగా చేసారో, వారి గురించి తెలియదు. ఓ అనాథలను సనాథలుగా చేసేవారా... అని పాడుతారు కూడా. అనాథ నుండి సనాథగా భారత్ ను మాత్రమే తయారుచేస్తారు. భారత్ యే సనాథగా, సదా సుఖమయంగా ఉండేది. పవిత్రత, శాంతి, సంపన్నత ఉండేవి. గృహస్థాశ్రమము ఉండేది. భారత్ అత్యంత పవిత్రంగా ఉండేది. 16 కళల సంపూర్ణులు, సంపూర్ణ నిర్వికారులు... అని పాడుతారు కూడా. ఇక్కడైతే అందరూ అనాథలుగా అయిపోయారు. హింస, అహింస అని వేటిని అంటారో కూడా వారికి తెలియదు. గోవులు మొదలైనవాటిని హతమార్చడం హింస అని వారు భావిస్తారు. తండ్రి అంటారు, ఒకరిపై ఒకరు కామ ఖడ్గాన్ని ఉపయోగించడం హింస. రావణుడు ప్రవేశించిన కారణంగా అందరూ పతితులుగా అయిపోయారు. తండ్రి అంటారు, నంబర్ వన్ శత్రువు దేహాభిమానము. తర్వాత కామము, క్రోధము, ఈ 5 వికారాలు మీ శత్రువులు, ఇవే మిమ్మల్ని అనాథలుగా చేసాయి. బాబా అడుగుతారు, ఓ భారతవాసీ పిల్లలూ, సత్యయుగంలో మేము సనాథలుగా ఉన్నప్పుడు ఎంత సుఖమయంగా ఉండేవారిమి అనేది మీకు గుర్తుకొస్తుందా! ఇక్కడ ఎవరైనా శరీరాన్ని విడిచిపెడితే, స్వర్గానికి వెళ్ళారని అంటారు. నరకం నుండి వెళ్ళారు కదా. కావున భారత్ ఈ సమయంలో నరకంగా ఉందని అర్థం చేయించాలి, దీనిని రౌరవ నరకమని అనడం జరుగుతుంది. గరుడ పురాణంలో కథలున్నాయి. వేరే నదులేవీ లేవు, విషయసాగరంలో అందరూ మునకలు వేస్తూ ఉంటారు. ఒకరినొకరు గాయపరచుకుంటూ, దుఃఖితులుగా చేస్తూ ఉంటారు. ఈ సుఖ-దుఃఖాల డ్రామా తయారై ఉంది అని తండ్రి వచ్చి అర్థం చేయిస్తారు. అంతేకానీ, ఇప్పుడిప్పుడే నరకము, ఇప్పుడిప్పుడే స్వర్గము అని కాదు. ఎవరి వద్ద చాలా ధనముందో, వారు స్వర్గంలో ఉన్నారని కాదు, ధనవంతులు కూడా దుఃఖితులు అవుతారు. ఈ సమయంలో మొత్తం ప్రపంచమంతా దుఃఖమయంగా ఉంది. తండ్రి అర్థం చేయిస్తారు, మీ యజమాని తల్లి-తండ్రి, వారి కోసమే మీరు పాడుతారు, మీరు తల్లి-తండ్రి... అని. మనుష్యులకైతే తెలియనే తెలియదు, లక్ష్మీనారాయణుల ఎదురుగా కూడా - మీరు తల్లి-తండ్రి... అని అంటారు, రాధా-కృష్ణుల

ఎదురుగా కూడా - మీరు తల్లి-తండ్రి... అని అంటారు, ఎందుకంటే తండ్రి గురించే తెలియదు. రచయిత అయిన తండ్రి గురించి మరియు వారి రచన గురించి తెలియదు. ఇది సృష్టి చక్రము. మాయ చక్రము అని అనరు. మాయ అని 5 వికారాలను అనడం జరుగుతుంది. ధనాన్ని సంపత్తి అని అంటారు. సంపత్తివాన్ భవ, ఆయుష్మాన్ భవ, పుత్రవాన్ భవ. ఈ ఆశీర్వాదాలను తండ్రి మాత్రమే ఇస్తారు. ఇకపోతే, వారందరూ అయితే భక్తి మార్గపు గురువులు. జ్ఞానసాగరుడు ఒక్కరే, వారి గురించే పాడుతారు. గీతను వినిపించి, మళ్ళీ శ్రీ కృష్ణ భగవానువాచ అని అనేస్తారు. అరే, కృష్ణుడు భగవంతుడెలా అవుతారు! రూపాన్ని మార్చుకొని రండి అని ఈ విధంగా పైనున్నవారిని పిలుస్తారు. ఆత్మలైన మీరైతే రూపాన్ని మార్చుకుంటారు. తండ్రి కూడా మనుష్య తనువులోకే వస్తారు కదా. ఎద్దు పైనైతే రారు. బాబా, మీరు కూడా మా వలె రూపాన్ని మార్చుకొని మనుష్య తనువులోకి రండి అని మీరు అంటారు. నేనేమీ ఎద్దు లేక తాబేలు, చేపలో రాను. మొట్టమొదట, ప్రజాపిత బ్రహ్మా ద్వారా మనుష్య సృష్టి రచింపబడుతుంది. కనుక ఇద్దరు తండ్రులయ్యారు - ఒకరేమో, పరమపిత పరమాత్మ శివ్, వారిని - ఓ అనాథలను సనాథలుగా చేసే బాబా రండి అని అంటారు, మళ్ళీ జ్ఞాన సూర్యుడు ఉదయించారు... అని పాడుతారు. జ్ఞాన సూర్యుడు ఆ తండ్రియే, వారు అందరికన్నా ఉన్నతమైనవారు. ఈ ఆటను కూడా అర్థం చేసుకోవాలి కదా. ఆట అంతా భారత్ కు సంబంధించినదే. మిగిలినవన్నీ ఉపకథలు. భారత్ యొక్క దేవీ-దేవతా ధర్మమే శ్రేష్ఠమైనది, నంబర్ వన్ అయినది. దైవీ ధర్మము, దైవీ కర్మలు శ్రేష్ఠంగా ఉండేవి. ఇప్పుడు ధర్మము, కర్మలు భ్రష్టమైపోయాయి.

తండ్రి అర్థం చేయిస్తారు, ముఖ్యమైన ధర్మాలు నాలుగు, అన్నింటికన్నా మొదటిది దేవీ-దేవతా ధర్మము. సత్యయుగ స్థాపనా కార్యాన్ని ఒక్క తండ్రియే చేస్తారు కదా. వారు హెవెన్లీ గాడ్ ఫాదర్. తండ్రి అంటారు, నేను కల్పం యొక్క ఒక్క సంగమయుగంలో మాత్రమే వస్తాను. మేము సనాథలుగా అవుతున్నామని పిల్లలైన మీకు తెలుసు. అనాథలను సనాథలుగా చేసేవారు ఒక్క తండ్రి మాత్రమే. మనుష్యులు మనుష్యులకైతే అల్పకాలికమైన సుఖాన్ని మాత్రమే ఇవ్వగలరు. ఇది ఉన్నదే దుఃఖ ప్రపంచము. ఆర్తనాదాలు చేస్తూ ఉంటారు. భారత్ సుఖధామంగా ఉండేది. ఇప్పుడు దుఃఖధామంగా ఉంది. శాంతిధామము నుండి వచ్చారు, ఇప్పుడు నాటకము పూర్తి అవుతుంది. ఈ వస్త్రం పాతదిగా అయిపోయింది, గృహస్థంలో ఉంటూ పవిత్రంగా అవ్వాలి. మీ తండ్రినైన నేను వచ్చాను, పవిత్రమైన స్వర్గాన్ని స్థాపన చేయడానికి. మొదట పవిత్రంగా ఉండేవారు, ఇప్పుడు అపవిత్రంగా ఉన్నారు. అర్ధకల్పము రామరాజ్యం, అర్ధకల్పము రావణరాజ్యం ఉంటుంది. ఇప్పుడు మీరు ఈశ్వరీయ ఒడిలో ఉన్నారు. ఇది ఈశ్వరీయ పరివారము. తాతగారు (గ్రాండ్ ఫాదర్) శివబాబా. తండ్రి ప్రజాపిత బ్రహ్మా. ఇది రియాల్టీ (వాస్తవికత). నిరాకార తండ్రి ప్రవేశించారని మీకు తెలుసు. మనుష్య తనువులో వచ్చారు. ఆ తండ్రి కూర్చుని ఆత్మలతో మాట్లాడుతారు. వారిని ఆత్మిక సర్జన్ అని అంటారు. ఆత్మకు ఇంజెక్షన్ వేస్తారు. వారు ఆత్మను నిర్లేప అని అంటారు కానీ ఆత్మ నిర్లేపి ఎలా అవుతుంది. ఆత్మలలోనే సంస్కారాలుంటాయి, వాటి అనుసారంగా జన్మ తీసుకుంటారు. ఇప్పుడు పిల్లలైన మీకు పరమపిత పరమాత్మ గురించి తెలుసు. అందరూ వారినే గుర్తు చేస్తారు, ఓ పతిత పావన పరమపిత పరమాత్మ, మీరు ఈ మనుష్య సృష్టికి బీజరూపుడైన తండ్రి, చైతన్యమైనవారు, జ్ఞానసాగరులు. మొత్తం జ్ఞానమంతా ఆత్మలోనే ఉంది. తర్వాత సంస్కారాల అనుసారంగా, చదువు ద్వారా వెళ్ళి మీరు రాజుగా అవుతారు. తండ్రిలో కూడా జ్ఞానం యొక్క సంస్కారాలు ఉన్నాయి కదా. సృష్టి యొక్క ఆదిమధ్యాంతాల జ్ఞానముంది. మిమ్మల్ని కూడా త్రికాలదర్శులుగా చేస్తారు. ఆత్మలమైన మనము మూలవతనం నుండి వస్తామని మీకు తెలుసు. బ్రహ్మాండాన్ని పరమాత్మ అని అనలేము. తండ్రి వచ్చి ఏ జ్ఞానాన్ని అయితే వినిపిస్తారో, దానికి గీత అని పేరు పెట్టారు. తండ్రియే వచ్చి రాజధానిని స్థాపన చేస్తారు. ఇంకెవ్వరూ రాజధానిని స్థాపన చేయరు. ఇప్పుడు రాజధాని స్థాపన అవ్వనున్నది, అందుకే పవిత్రంగా అవ్వాలి. ఇప్పుడు తండ్రి పిల్లలైన మీకు జ్ఞానాన్ని ఇచ్చి పవిత్రంగా చేసి, తమవారిగా చేసుకుంటారు. డ్రామా అనే పదం కూడా ఎవరికీ తెలియదు. ఇది అనాది, అవినాశీ డ్రామా. ఆత్మలందరికీ అవినాశీ పాత్ర లభించి ఉంది. పరమాత్మకు కూడా పాత్ర ఉంది. శివుడు అంత పెద్ద లింగమేమీ కాదు అని బాబా అర్థం చేయించారు. వారిని పరమపిత పరమాత్మ అని అంటారు. ఆత్మ రూపమేమిటి? నక్షత్రము, లైట్, భృకుటి మధ్యలో అద్భుతమైన నక్షత్రం మెరుస్తుంది, ఇంత చిన్న ఆత్మలో ఎంత పెద్ద పాత్ర ఉంది. ఆశ్చర్యం కదా. నా ఆత్మలో కూడా పాత్ర ఉంది అని తండ్రి అంటారు. భక్తి మార్గంలో నేను మీకు ఎంత సేవ చేస్తాను. ఈ సమయంలోనైతే చాలా అద్భుతమైన పాత్ర ఉంది. కల్ప-కల్పము పిల్లలైన మీ పాత్ర నడుస్తూ ఉంటుంది. పాత్రధారులు కూడా నంబరువారుగా ఉంటారు. అందరికన్నా మొదటివారు బాబా. తండ్రి వద్ద ఏ జ్ఞానమైతే ఉందో, అది అందరికీ ఇస్తారు. తండ్రి అంటారు, పిల్లలూ, ఈ రాజధాని స్థాపనవుతూ ఉంది. ఇప్పుడు పురుషార్థం చేసి ఉన్నత పదవిని పొందండి, ఏ సీట్ కావాలంటే, అది తీసుకోండి. ప్రారబ్ధము కోసం పురుషార్థము చేయాలి, అనంతమైన తండ్రి ద్వారా అనంతమైన సుఖాన్ని పొందడానికి. జగదంబను గాడెస్ ఆఫ్ నాలెడ్జ్ (జ్ఞాన దేవి) అని అంటారు. జ్ఞానం ఎక్కడి నుండి

లభించింది? బ్రహ్మ నుండి. బ్రహ్మకు ఎవరిచ్చారు? శివ పరమాత్మ. బ్రహ్మ ద్వారా బ్రహ్మకుమార-కుమారీలకు ఈ జ్ఞానం లభిస్తూ ఉంది, ఆ బ్రాహ్మణులే మళ్ళీ ఈ యజ్ఞానికి నిమిత్తులుగా అవుతారు. దీనిని రుద్ర జ్ఞాన యజ్ఞమని అంటారు, దీనిలో ఈ ప్రపంచమంతా సమాప్తమైపోతుంది. పండుగలన్నీ ఈ సంగమానికి చెందినవి. శివునికి బదులుగా కృష్ణ రాత్రి అని చెప్పి, కృష్ణుని జన్మను రాత్రిలో చూపించారు. శివరాత్రి యొక్క అర్థాన్ని అర్థం చేసుకోరు. కలియుగము రాత్రి, సత్యయుగము పగలు. రాత్రిలో వచ్చి పగలుగా చేస్తారు, దానిని శివజయంతి అని అంటారు. అనంతమైన రాత్రి, అనంతమైన పగలు ఉంటుంది. ఈ శివశక్తి సైన్యము భారత్ ను స్వర్గంగా తయారుచేసేటువంటిది. చూడండి, ఎలా గుప్తంగా కూర్చుని చదువుతున్నారు. యోగబలంతో రాజ్యాన్ని తీసుకుంటారు. ప్రాచీన రాజయోగము ప్రసిద్ధమైనది, దీని ద్వారా విశ్వ రాజ్యాధికారం లభిస్తుంది. అందరూ పావనంగా అయిపోతారు. ఈ జ్ఞానాన్ని ఆత్మ ధారణ చేస్తుంది. ఆత్మ యొక్క జ్ఞానం కూడా ఎవరిలోనూ లేదు. అక్కడ ఆత్మ జ్ఞానముంటుంది. ఇకపోతే, పరమాత్మ గురించి, రచన గురించి జ్ఞానముండదు. ఈ జ్ఞానం కేవలం బ్రాహ్మణులైన మీకు మాత్రమే ఉంది. మీరు అందరికన్నా ఉన్నతమైనవారు, ఆత్మిక సేవను చేస్తారు. ప్రేయసులైన మిమ్మల్ని తెల్లగా తయారుచేయడానికి ఒక బాటసారి వస్తారు. బాటసారి ఒక్కరే, మిగిలినవారంతా ప్రేయసులు. ప్రజలుగా తయారయ్యేవారిది మరియు ముక్తిధామంలో నివసించేవారిది పెద్ద పెళ్ళి ఊరేగింపు ఉంటుంది. అందరినీ అలంకరించి తీసుకువెళ్ళేందుకే ప్రియుడు వస్తారు, అందరూ దోమల గుంపు వలె వెళ్తారు. అచ్ఛా!

మధురాతి మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. లైట్ హౌస్ గా అవ్వాలి. ఒక కంటిలో శాంతిధామము, రెండవ కంటిలో సుఖధామము కనిపిస్తూ ఉండాలి. ఈ దుఃఖధామాన్ని చూస్తూ కూడా చూడకూడదు.

2. తండ్రి సమానంగా జ్ఞానంలో సంపన్నులుగా అయి, అనంతమైన సుఖాన్ని తీసుకునేందుకు పూర్తి పురుషార్థము చేయాలి. ఏ జ్ఞానమైతే లభించిందో, అది ఇతరులకు ఇవ్వాలి.

వరదానము:- సర్వ ప్రాప్తుల స్మృతి ద్వారా ఉదాసీనతకు విడాకులిచ్చేటువంటి సంతోషాల ఖజానాలతో సంపన్న భవ

సంగమయుగంలో బ్రాహ్మణ పిల్లలందరికీ తండ్రి ద్వారా సంతోషం యొక్క ఖజానా లభిస్తుంది, అందువలన ఏం జరిగినా సరే - ఈ శరీరం పోయినా కానీ, సంతోషం యొక్క ఖజానాలను విడిచిపెట్టకండి. సదా సర్వ ప్రాప్తుల యొక్క స్మృతిలో ఉన్నట్లయితే, ఉదాసీనతకు విడాకులు లభిస్తాయి. వ్యాపార-వ్యవహారాలలో నష్టం వచ్చినా కూడా, మనసులో ఉదాసీనత యొక్క అల రాకూడదు ఎందుకంటే తరగని ప్రాప్తుల ఎదురుగా ఇదేమంత పెద్ద విషయము! ఒకవేళ సంతోషమున్నట్లయితే అన్నీ ఉన్నట్లే, సంతోషం లేకపోతే ఏదీ లేదు.

స్లోగన్:- మాస్టర్ దుఃఖహర్త-సుఖకర్త యొక్క పాత్రను పోషించడానికి సర్వ ప్రాప్తులతో సంపన్నంగా అవ్వండి.

మాతేశ్వరి గారి అమూల్యమైన మహావాక్యాలు

భగవానువాచ - పిల్లల పట్ల, పిల్లలూ, ఈ గురువుల మతము, శాస్త్రాల మతము, ఇవేవీ నా మతము కాదు, ఇవి కేవలం నా పేరు మీద మతాన్నిస్తారు కానీ నా మతమైతే నాకు తెలుసు, నన్ను కలుసుకునే అడ్రస్ కూడా నేనే వచ్చి ఇస్తాను, దానికన్నా ముందు నా అడ్రస్ ఎవ్వరికీ తెలియదు. గీతలో భగవానువాచ అని ఉండి ఉండవచ్చు కానీ గీతను కూడా మనుష్యులు వినిపించారు. భగవంతుడైతే స్వయం జ్ఞానసాగరుడు, భగవంతుడు ఏవైతే మహావాక్యాలను వినిపించారో, వాటి స్మృతిచిహ్నంగా తర్వాత గీత తయారయింది. ఈ విద్వాంసులు, పండితులు, ఆచార్యులు అంటారు, పరమాత్మయే సంస్కృతంలో మహావాక్యాలను ఉచ్చరించారు, వాటిని నేర్చుకోకుండా పరమాత్మ లభించలేరు అని. ఈ విధంగా ఇంకా వ్యతిరేక కర్మకాండల్లో చిక్కుకునేలా చేస్తారు. వేదశాస్త్రాలు చదివి మెట్లు ఎక్కినా, మళ్ళీ అంతగానే దిగాల్సి ఉంటుంది అనగా వాటిని మర్చిపోయి ఒక్క పరమాత్మతో బుద్ధియోగాన్ని జోడించాల్సి ఉంటుంది ఎందుకంటే పరమాత్మ స్పష్టంగా చెప్తారు, ఈ కర్మకాండలు, వేదశాస్త్రాలు చదవడం ద్వారా నా ప్రాప్తి జరగదు. ధృవుడు, ప్రహ్లాదుడు, మీరా ఏ శాస్త్రాలు

చదివారు? ఇక్కడైతే చదివినవన్నీ కూడా మర్చిపోవాల్సి ఉంటుంది. ఎలాగైతే అర్జునుడు చదివారు, కానీ వారికి కూడా మర్చిపోవాల్సి వచ్చింది. భగవంతుని స్పష్టమైన మహావాక్యం ఏమిటంటే, శ్వాస-శ్వాసలోనూ నన్ను స్మృతి చేయండి, ఇందులో ఇంకేమీ చేయాల్సిన అవసరం లేదు. ఎప్పటివరకైతే ఈ జ్ఞానం ఉండదో, అప్పటివరకు భక్తి మార్గం నడుస్తుంది కానీ జ్ఞానం యొక్క దీపం వెలిగినట్లయితే కర్మకాండలు వదిలిపోతాయి ఎందుకంటే కర్మకాండలు చేస్తూ-చేస్తూ ఒకవేళ శరీరం విడిచిపెడితే, ఏం లాభం కలిగింది? ప్రారబ్ధమైతే తయారవ్వలేదు, కర్మబంధనాల లెక్కాచారాల నుండైతే ముక్తి లభించలేదు. అసత్యం చెప్పకుండా ఉండడం, దొంగతనం చేయకుండా ఉండడం, ఎవరికీ దుఃఖమివ్వకుండా ఉండడం, ఇవి మంచి కర్మలని మనుష్యులు భావిస్తారు. కానీ ఇక్కడైతే సదాకాలానికి కర్మల యొక్క బంధనాల నుండి విముక్తులవ్వాలి మరియు వికర్మల మూలాన్ని తీసివేయాలి. మేము అయితే ఇప్పుడు కోరుకుంటున్నాము, ఎలాంటి బీజము వేయాలంటే, దీని నుండి మంచి కర్మల వృక్షము వెలువడాలి, అందుకే మనుష్య జీవితంలో తమ కార్యాలను తెలుసుకొని శ్రేష్ఠ కర్మలు చేయాలి. ఇకపోతే, పరమాత్మను ఎవరు ఎంతగా గుర్తిస్తారో, అంతగా సమీపంగా వస్తారు. ఈ రహస్యాలన్నీ పారబ్రహ్మంలో ఉండే పరమాత్మ, ఎవరైతే ఆతాళానికి-పాతాళానికి పైన ఉన్నారో, వారే వచ్చి వినిపిస్తారు. అచ్ఛా - ఓంశాంతి.